# అంతకంటె ఎక్కువే!

సుబ్బయ్యశెట్టి తన కొట్లో కూర్చుని పద్దులు చూసుకుంటున్నాడు. ఇంతలో శేషయ్య వచ్చాడు.

"ఏం శేషయ్యా - పొద్దున్నే ఇలా వచ్చావు, పొలం వెళ్ళలేదా? ఛుజానికి ఆ సంచి ఏమిటి?" అంటూ పలకరించి మళ్ళీ పద్దు పుస్తకంలో తల దూర్చాడు సుబ్బయ్యశెట్టి.

"ఏం లేదయ్యా శెట్టీ, నిన్నొక విషయం అడగడానికి వచ్చాను. కాస్త సలహా ఇస్తావా?" అంటూ సుబ్బయ్యశెట్టి పక్కనే కూర్చున్నాడు శేషయ్య.

"సలహానేకదా! అడుగు" అంటూ పద్దులు సరిచేసుకోసాగాడు శెట్టి.

"శెట్టీ నా దగ్గర కాస్త డబ్బుంది. దాన్నెక్కడ దాస్తే బాగుంటుందో చెప్పు. ఈమధ్యన మనూర్లో దొంగతనాలు కూడ మొదలయ్యాయి కదా" అడిగాడు శేషయ్య.

"డబ్బా! ఎంతుందేమిటి....? పదివేలుంటుందా?" అడిగాడు శెట్టి వంచిన తల ఎత్తకుండానే.

"అంతకంటే ఎక్కువే" అన్నాడు శేషయ్య.

"ఆఁ అంతకంటే ఎక్కువా? పాతిక వేలుంటుందా?" అంటూ అడిగాడు శెట్టి పుస్తకాలు మూస్తూ.

"అంతకంటే ఎక్కువేనయ్యా" అన్నాడు శేషయ్య.

శెట్టిలో కుతూహలం పెరిగిపోయింది. పద్దు పుస్తకాలు పక్కనపెట్టి, శేషయ్యకి దగ్గరగా జరుగుతూ—

"శేషయ్యా.... అంతకంటే ఎక్కువే.... అంతకంటే ఎక్కువే అంటూ నా ప్రాణాలు తీసేబదులు నీ దగ్గర ఎంతుందో చెప్పకూడదూ-" అన్నాడు.

"అది తర్వాత చెప్తాగానీ, ముందు ఎక్కడ దాస్తే మంచిదో చెప్పు" అన్నాడు శేషయ్య.

శెట్టి ఊరుకోలేకపోయాడు.

"ఓ యాభై వేలుంటుందంటావా?" అంటూ శేషయ్యకి మరీ దగ్గరగా జరిగాడు ఆత్రంగా.

"అంతకంటే ఎక్కువే" అన్నాడు శేషయ్య.

"అయ్యబాబోయ్! అంతకంటే కూడ ఎక్కువా! శేషయ్యా.... అయితే బ్యాంకులో వాయి. అక్కడే బావుంటుంది. నీకు వడ్డీకూడా వస్తుంది. భయమేమీ ఉండదు. పద నీకు తోడుగా వస్తాను. నీకు బ్యాంకుకివెళ్ళే అలవాటు లేదుగా. నేను అప్పుడప్పుడూ వెళ్తావుంటాను. డబ్బు జాగ్రత్త. ఒరే దాసూ.... కొట్టు జాగ్రత్తగా చూస్తూవుండు, నేనిప్పుడే వస్తాను." అంటూ లోపలికి కేకవేసి శేషయ్యని వెంటబెట్టుకుని బ్యాంకుకి బయలుదేరాడు సుబ్బయ్యశెట్టి.




ఇద్దరూ కలిసి బ్యాంకుకి వెళ్ళారు.

శెట్టి గబగబా ప్యూన్ దగ్గరకి వెళ్ళి "బాబూ మేనేజరుగారు ఏంచేస్తున్నారు?" అంటూ అడిగాడు.

"లోపలున్నారు వెళ్ళండి" అన్నాడు ప్యూన్.

"రావయ్యా శేషయ్యా" అంటూ మేనేజరు రూంలోకి వెళ్ళాడు శెట్టి. శెట్టిని అనుసరించాడు శేషయ్య.

అప్పటివరకూ అర్జెంట్‌గా చూడవలసిన కాగితాల్ని చూసి విశ్రాంతిగా వెనక్కివాలి కూర్చున్న మేనేజరు వీళ్ళనిచూసి — "రండి శెట్టిగారూ కూర్చోండి. ఏమిటిలా దయచేసారు." అంటూ ప్యూన్‌ని పిలిచి మూడు కాఫీలు తెమ్మనిచెప్పాడు.

"మేనేజరుగారూ... మీకో కొత్త కస్టమర్‌ని తీసుకొచ్చాను ఇదిగో ఇతనే, పేరు శేషయ్య. యాభై వేల పైనే మీ బ్యాంకులో దాస్తాడు." అంటూ కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు శెట్టి.

"యాభై వేల పైనే అంటే ఎంతుంటుందంటారు శేషయ్యగారూ డెభ్భైవేలా, ఎనభై వేలా.... లక్షా" యధాలాపంగా అడిగాడు మేనేజరు.

"అంతకంటే ఎక్కువేనండీ" అన్నాడు శేషయ్య.

"లక్షకంటే ఎక్కువా!" అంటూ అంతవరకూ కుర్చీలో వాలి విశ్రాంతిగా కూర్చున్న మేనేజరు ముందుకు వంగి "అంటే దాదాపు రెండు లక్షలుంటుందంటారా" అడిగాడు చిరుచెమట్లు పడుతుండగా.

"దాన్దేముందండీ! అక్షరాలా అంతకంటే ఎక్కువే" అన్నాడు శేషయ్య.

"ఆఁ! అంతకంటేకూడా ఎక్కువా? చూడండి శేషయ్యగారూ.... మీరు ఐదులక్షల వరకూ ఎలాంటి భయమూ లేకుండా ఇక్కడ దాచుకోవచ్చు. ఇప్పటివరకూ లక్షపైన ఏవ్యక్తీ ఈ బ్రాంచిలో డిపాజిట్ చెయ్యలేదు. మీరే మొదటివారు" అన్నాడు చెమటపట్టిన ముఖాన్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

# మినీ కథ

ఇంతలో ప్యూన్ కాఫీ తెచ్చాడు.

"ముందు కాఫీ తీసుకోండి" అన్నాడు మేనేజరు వినయంగా.

ఎలాగైనా సరే ఇతన్ని వెళ్ళనివ్వకూడదు. ఇంత పెద్ద మొత్తాన్ని డిపాజిట్ చేయించినందుకు నాకు ఎంత పేరొస్తుందో ఏదైనా పెద్ద బ్రాంచికి మానేజర్ని అయ్యే అవకాశంకూడా ఉంది. అనుకుంటూ ఊహాలోకాల్లో విహరించసాగాడు మేనేజరు.

కాఫీ తాగడం పూర్తయిన తరువాత—

అయ్యా మేనేజరుగారూ ఐదులక్షలకంటే ఎక్కువైతే ఇక్కడ దాచుకోనివ్వరా ? అమాయకంగా ప్రశ్నించాడు శేషయ్య.

మేనేజరుకి శెట్టికీ మతిపోయింది.

ముందుగా మేనేజరు తేరుకుని—

శేషయ్యగారూ.... మీ దగ్గర ఎన్ని లక్షలున్నా సరే మీరు నిర్భయంగా దాచుకోవచ్చు. ఆ ఏర్పాట్లు నేనుచేస్తాను. మీరేం బెంగ పెట్టుకోకండి. ఫారమ్స్ తెప్పిస్తాను. వాటిమీద సంతకాలు చెయ్యండి" అంటూ ప్యూన్ని పిలిచి హెడ్ క్యాషియర్ని పిలవమన్నాడు.

"హమ్మయ్య, అంటే నా డబ్బంతా ఇక్కడ దాచుకోవచ్చన్నమాట. నా బెంగ తీరిపోయింది. వారం రోజులనుంచీ ఈ బెంగవల్ల నాకు నిద్ర కూడా సరిగ్గా పట్టలేదు" అంటూ భుజానికి ఉన్న బ్యాగ్ని కిందపెట్టి, జేబులోనుండి ఓ లాటరీ టిక్కెట్టుని జాగ్రత్తగా బయటకుతీసి—

"మేనేజరుగారూ, ఇదిగో పదిలక్షల లాటరీ టిక్కెట్. రేపే డ్రా. డబ్బొస్తే ఇక్కడే.... తప్పకుండా మీ బ్యాంకులోనే దాచుకుంటా. డబ్బొచ్చిన వెంటనే మీ దగ్గరికి వస్తా సెలవ్, రావయ్యా శెట్టీ...." అంటూ టిక్కెట్టుని జాగ్రత్తగా జేబులో దాచుకుని బ్యాగ్ భుజానికి తగిలించుకుని బయటకి దారి తీసాడు శేషయ్య తాపీగా.

"ఆఁ ' ? !" అంటూ నోళ్ళు తెరుచుకుండిపోయారు మేనేజరూ, శెట్టీ.

అప్పుడే లోపలికి అడుగుపెట్టిన హెడ్ క్యాషియర్ బయటికి వెళ్ళిపోతన్న శేషయ్యనీ, నోళ్ళు తెరుచుకుని, వెళ్ళిపోతున్న శేషయ్యనే చూస్తున్న మేనేజరుని, శెట్టిని చూసి ఏం అర్థంకాక అలాగే నిలబడిపోయాడు.



— అడపా రమేష్‌గోపాల్

ప్లాట్ నెం : 237/5
సెక్టార్ నెం : 5, తంతితపాలా క్వార్టర్స్
ముప్పాలవానిపాలెం, విశాఖపట్నం

## ఈవారం ఎన్నికైన కథలు

1) అనుభవం – జి.కె. ఉదయ్ (జంపని)
2) కైలాసంలో కలహం "
3) డిగ్రీస్ ఆఫ్ హానెస్టీ – బి.వి.వి. సుబ్బారావు (బాపట్ల)
4) యక్షప్రశ్నలు – కందమూరి జనార్ధన్ (చిత్తూరు)
5) ధర్మభూమి – హాణ్యం దశరశర్మ పలాస)
6) విక్రమ్ ఔర్ భేతాళ్ – వి. శ్రీనివాసరావు (విజయవాడ)
7) నమ్మినబంటు – యన్. గాయత్రీబాపూజీ (సిలీక్యాంపస్)
8) ఫస్ట్ షో – యం.వి. రాఘవేంద్రరావు (గుంటూరు)
9) అంకెల మంత్రం – పిళ్ళా రాజేంద్రప్రసాద్ (హైదరాబాదు)

## వడ్డేపల్లి పదాలు

కోర్టులో న్యాయమ్ము జరిగెను
నీకనుచు
కోరి పోబోవకే మనసా!
క్రింది కోర్టాక తీర్పు, మీది
కోర్టాక తీర్పు
క్రిందుమీదుగ యిచ్చు తెలుసా!
విడిచేసి గుడ్డల్ని వీథిలో తిరిగితే
పిచ్చెక్కెనంటారు మనసా!
క్లబ్బులో వలువల్ని కైపులో
వదలితే
'క్యాబరే' యంటారు తెలుసా!
'టెస్టుట్యూబు'ల లోన 'బేబీ'ని
పుట్టించు
తెలివి పెరిగేను నేడు మనసా!
కురు-పాండవులగురువు ద్రోణుండు
సైతమ్ము
కుంభ సంభవుడేను తెలుసా!




## ఫర్ యువర్ ఇన్‌ఫర్‌మేషన్

మీకు తెలుసా

1) అంతరిక్షములో నడచిన మొట్టమొదటి వనిత.
2) యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ జనరల్.
3) మనం రోజూ ఉపయోగించే 'సేఫ్టీపిన్' కనుగొన్నది.
4) రోజ్ పింక్ సిటీ అని ఈ నగరానికి పేరు.
5) ప్రసిద్ధ గ్రంథం "సోషల్‌కాంట్రాక్ట్" యొక్క రచయిత.
6) మంగోలియా దేశము యొక్క పార్లమెంటు పేరు.
7) "ఇటలీ" దేశపు ద్రవ్యమానం

పంపినవారు : ఆనిశెట్టి వెంకటేశ్వర్లు (హన్మకొండ)

సమాధానాలకోసం 30వ పేజీ చూడండి

